వాడుకొని వదిలేసిన కాంగ్రెస్

- నిరుద్యోగుల ఆశలపై రేవంత్ సర్కార్ నీళ్లు
- కాళ్లు మొక్కి అర్థించినా స్పందన శూన్యం
- కడుపుమండి పోరుబాటలో నిరుద్యోగులు

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ) : ఏటా జాబ్‌క్యాలెండర్‌తో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తమన్నది. నిరుద్యోగభృతి ఇస్తమన్నది. గ్రూప్స్ పోస్టులు పెంచుతమన్నది.నిరుద్యోగుల జేఏసీ యాత్ర పేరుతో ఎన్నికల ప్రచారం చేయించింది. అన్నితీర్లా వాడుకొని అందలమెక్కాక ముఖం చాటేసింది. రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేస్తున్నా,కాళ్లు మొక్కినా, మోకాళ్లపై ఉండి అర్థించినా కనికరించడంలేదు. నిరుద్యోగులు పోరుబాటపడితే అణచివేతకు ప్రయత్నిస్తున్నది. వినతులు, విజ్ఞాపనలు ఇచ్చి విసిగిపోయిన నిరుద్యోగులు ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టారు. టీజీపీఎస్సీ ఆఫీస్‌ను ముట్టడించారు. తమకు న్యాయం చేయలేని ప్రభుత్వం దిగిపోవాలని హెచ్చరించారు.నిరసన తెలుపుతున్నవారితో ప్రభుత్వం మాట్లాడటం, చర్చలు జరపడం సంప్రదాయం. రేవంత్ సర్కారు ఏమాత్రం స్పందన లేకుండా ఉండటంపై నిరుద్యోగుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది.

ప్రధాన డిమాండ్లు ఇవీ..

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా జాబ్‌క్యాలెండర్‌ను అధికారికంగా ప్రకటించకపోవడంపై మండిపడుతున్నారు. 2025 -26 జాబ్‌క్యాలెండర్‌ను రూపొందిస్తున్నట్టు తెలుస్తుండగా 2024 -25 జాబ్ క్యాలెండర్‌ను అటకెక్కించారా అని ప్రశ్నిస్తున్నారు.
- ఏటా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగభృతి ఎటుపోయిందని నిలదీస్తున్నారు.
- గ్రూప్ -2, 3 పోస్టులు పెంచుతామని, పరీక్షల మధ్య కనీసం రెండు నెలల గ్యాప్ ఇస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని అడుగుతున్నారు. కేసీఆర్ సర్కారు జారీచేసిన గ్రూప్ -2లోని 783 పోస్టులు, గ్రూప్-3లో 1,388 పోస్టులకే ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్ -2, నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్ -3 రాత పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిందని, గ్రూప్-2, 3 పోస్టులు పెంచాలని, రెండు నెలల వ్యవధి ఉండేలా షెడ్యూల్‌ను సవరించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.
- గ్రూప్-1 పోస్టులు పెంచాలని, ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు 1:50కి బదులుగా 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను అనుమతించాలని అప్పటి కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత భట్టి విక్రమార్క అసెంబ్లీ వేదికగా గొంతుచించుకున్నారని, ఇప్పుడు 1:50విధానంలోనే ఎంపికచేస్తున్నారని, ఇదేం ద్వంద్వనీతి అని నిరుద్యోగులు దుమ్మెత్తిపోస్తున్నారు. గ్రూప్-1 పరీక్ష నిర్వహణలోనూ కాంగ్రెస్ సర్కారు నిరుద్యోగుల డిమాండ్లను లెక్కలోకి తీసుకోలేదు. ఇంటెలిజెన్స్ బ్యూరో ఎగ్జామ్,పార్లమెంట్ కౌంటింగ్ నేపథ్యంలో గ్రూప్-1 పరీక్ష వాయిదావేయాలని కోరినా పట్టించుకోలేదు. హైకోర్టు మెట్లెక్కినా పరీక్ష నిర్వహణకే ప్రభుత్వం మొగ్గుచూపింది.
- బడికో టీచర్ పోస్టు కేటాయిస్తామని, మెగా డీఎస్సీ వేసి 25వేల టీచర్ పోస్టులు భర్తీచేస్తామని కాంగ్రెస్ నేతలు హామీనిచ్చారు. కానీ అధికారంలో వచ్చాక 11వేల పోస్టులకే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. వీటిలో ఐదువేల పోస్టులు బీఆర్ఎస్ సర్కారు హయాంలో నోటిఫికేషన్ ఇచ్చినవే. తాజా టీచర్ల పదోన్నతులతో మరో 15వేల పోస్టులు ఖాళీకానున్నాయి. వాటిని తాజా డీఎస్సీలో చేర్చాలని, డీఎస్సీకి 40రోజుల సమయం ఇవ్వాలని డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు ఇటీవలే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహించారు. గ్రంథాలయాలు, స్టడీహాళ్ల ఎదుట ధర్నాలు చేశారు.
- ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన జీవో-46ను రద్దుచేయాలని కోరుతున్నారు. జనాభా ప్రతిపాదికన ఉద్యోగాలు భర్తీచేయడం ఈ జీవో ఆంతర్యం. తక్కువ జనాభా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ పోస్టులు, ఎక్కువ జనాభా ఉన్న అర్బన్ ప్రాంతాల్లో ఎక్కువ పోస్టులు భర్తీ చేస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో 120 -130 మార్కులొచ్చినా ఉద్యోగం రాకపోగా, పట్టణ ప్రాంతాల్లో 80-90మార్కులొచ్చిన వారికి ఉద్యోగాలొచ్చాయి. ఈ జీవోను రద్దు చేయాలని అభ్యర్థులు ధర్నా నిర్వహించినా ఒక్క కాంగ్రెస్ ప్రజాప్రతినిధి కూడా పట్టించుకున్న పాపానపోలేదు.
- టీఎస్‌పీఎస్సీ ఎగ్జామ్స్‌లోనూ ఆరోహణ క్రమాన్ని పాటించాలన్నది అభ్యర్థుల ప్రధాన డిమాండ్. కానీ, టీఎస్‌పీఎస్సీ అది పాటించడంలేదు. ఇప్పటికే నిర్వహించిన జేఎల్ పోస్టుల ఫలితాలు ఇవ్వకుండా గ్రూప్ -4 పోస్టులు భర్తీచేస్తున్నారు. దీంతో జేఎల్ ఉద్యోగాలొచ్చినప్పుడు గ్రూప్ -4 పోస్టులు ఖాళీ అయ్యే అవకాశమున్నది. ఇలాంటి విధానాన్ని సరిచేయాలని అభ్యర్థులు కోరుతున్నా పట్టించుకున్న నాథుడే లేడు.

రిలింక్విష్‌మెంట్ చేపట్టాలి

గురుకుల పోస్టుల భర్తీలో రిలింక్విష్‌మెంట్ చేపట్టాలని నిరుద్యోగులు గొంతు చించుకుంటున్నారు.అవరోహణ పద్ధతిలో పోస్టులు భర్తీచేయాలని ఉద్యమిస్తున్నారు. కానీ కాంగ్రెస్ సర్కారు అసంబద్ధంగా హైలెవల్ క్యాడర్ పోస్టులను ముందు భర్తీ చేయకుండా లోలెవల్ పోస్టులను ఆరోహణ పద్ధతిలో భర్తీచేసింది. దీంతో ఒకే అభ్యర్థికి మూడు, నాలుగు ఉద్యోగాలు రాగా, చాలా మంది ఉద్యోగాలు రాకుండా నష్టపోయారు. ఆరోహణ క్రమంలో ఉద్యోగాలు భర్తీచేయాలని అభ్యర్థులు కలవని మంత్రి లేడు. ఐదునెలలుగా గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

సీఎం నివాసం వద్ద ఆందోళన నిర్వహిస్తూ కన్నీళ్లు పెట్టుకుంటున్న అభ్యర్థిని ఓదారుస్తున్న మరో అభ్యర్థి

సీఎం ఇంటివద్ద గురుకుల అభ్యర్థుల ఆందోళన

- న్యాయం చేయాలని మోకాళ్లపై నిరసన
- పెద్దమ్మగుడి వద్ద అభ్యర్థుల భిక్షాటన
- కొంగుపట్టి అర్థించిన మహిళా అభ్యర్థులు
- సీఎం లేకపోవడంతో ఫ్లెక్సీకి వినతి
- ఆందోళనకారులపై పోలీసుల జులుం
- కవరేజీ లేకుండా పాత్రికేయుల గెంటివేత

కన్నీళ్లు పెట్టుకుంటున్న తల్లిని తదేకంగా చూస్తున్న బాలుడు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ): గురుకుల టీచర్ పోస్టుల భర్తీలో న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న రెండువేల పోస్టులను బ్యాక్‌లాగ్ చేయకుండా భర్తీ చేయాలని కోరుతూ అభ్యర్థులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. మోకాళ్ల మీద కూర్చొని నినాదాలు చేశారు. పోస్టుల భర్తీలో తమకు జరిగిన అన్యాయానికి నిరసనగా కొందరు జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి వద్ద భిక్షాటన చేశారు. మహిళా అభ్యర్థులు కొంగుపట్టి తమ కు న్యాయం చేయాలని అర్థించారు. ప్రభుత్వ మొండి వైఖరితో తమకు తీవ్ర నష్టం జరుగుతున్నదని, డౌన్ మెరిట్ లిస్ట్ విడుదల చేసి ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం ఢిల్లీ పర్యటనలో ఉండటంతో వారు ఆయన ఫ్లెక్సీకి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రితో తమ గోడు వెళ్లబోసుకునేందుకు వచ్చిన అభ్యర్థులపై భద్రతా సిబ్బంది జులుం ప్రదర్శించారు. గురుకుల టీచర్ అభ్యర్థుల ఆందోళనను కవర్ చేసేందు కు వచ్చిన మీడియా ప్రతినిధులను అడ్డుకోవడంతోపాటు వారిని అక్కడి నుంచి గెంటివేశారు. ఆందోళనకారులు అక్కడి నుంచి నేరు గా గాంధీభవన్ చేరుకుని వినతిపత్రం అందజేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.

2500కు పైగా పోస్టులు బ్యాక్‌లాగ్?

గురుకులాల్లో 9,210 టీచర్ పోస్టుల భర్తీకి గత కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఉన్నత హోదా నుంచి కిందిస్థాయి పోస్టుల వరకు భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీల ప్రక్రియను కింది నుంచి పైస్థాయికి చేపట్టడంతో ఒకే అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపిక య్యాడు. దీంతో 2,500పైగా పోస్టులు మిగిలిపోయా యి. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన ఈ విధానంతో భారీ సంఖ్యలో నిరుద్యోగులకు నష్టం వాటిల్లింది. అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్‌తో నిరుద్యోగులను ఆదుకుంటామని చెప్పిన కాంగ్రెస్... అధికారం చేపట్టిన తర్వాత గందరగోళంగా భర్తీ ప్రక్రియ చేపట్టి నిరుద్యోగులకు తీవ్ర నష్టం చేస్తున్నదని వారు వాపోతున్నారు.

'గురుకుల' సమస్యలు పరిష్కరించాలి: హరీశ్

- అభ్యర్థుల నిరసనకు మద్దతు

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): రాజకీయాలే పరమావధి గా నడుస్తున్న సోకాల్డ్ ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవటం బాధాకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా మొర ఆలకించకపోవటం శోచనీయమని మండిపడ్డారు. గురుకుల అభ్యర్థుల నిరసనకు హరీశ్‌రావు ఎక్స్ వేదికగా బుధవారం మద్దతు ప్రకటించారు. గురుకులాల్లో టీచర్ల కొరత లేకుండా 9,210 టీచర్ పోస్టుల భర్తీకి నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఒక్క పోస్టు కూడా మిగిలిపోవద్దనే ఉన్నతహోదా పోస్టుల నుంచి ప్రారంభించి కింది స్థాయి పోస్టుల వరకు ఫలితాలు వెల్లడించి భర్తీ చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరించటం వల్ల ఒకే అభ్యర్థికి ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు వచ్చాయని, తద్వారా దాదాపు 2,500పైగా టీచర్ పోస్టులు మిగిలిపోయి, అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

సెప్టెంబర్ తర్వాతనే కొత్త టీచర్లు..!

- వచ్చే నెలలో డీఎస్సీ పరీక్షలు
- వాయిదాకు అభ్యర్థుల డిమాండ్

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైనా టీచర్ల కొరత వేధిస్తున్నది. కొత్తగా డీఎస్సీ ద్వారా నియమితులయ్యే టీచర్లు కోర్టు వివాదాలు లేకపోతే సెప్టెంబర్ తర్వాతే వచ్చే అవకాశాలున్నాయి. 21,299 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రభుత్వం 11,062 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. జూలై 17 నుంచి 31 వరకు 2,79,956 మంది అభ్యర్థులు డీఎస్సీ రాత పరీక్షలు రాయనున్నారు. నియామకాలు కొలిక్కి వచ్చే వరకు సెప్టెంబర్ దాటే అవకాశాలున్నాయని అధికారులు అంచనావేస్తున్నారు. కాగా, డీఎస్సీని నెల రోజులు వాయిదావేయాలని పలువురు అభ్యర్థులు ఆందోళన నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ పరీక్ష కావడంతో టీసీఎస్ నుంచి తేదీలు తీసుకున్నామని, షెడ్యూల్ ప్రకారమే నిర్వహిస్తామని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఏకంగా సీఎం ఆర్డరే క్యాన్సిల్

- అనర్హురాలంటూ పోస్టింగ్ ఇవ్వని గురుకుల సొసైటీ
- ఆవేదన చెందుతున్న కరీంనగర్ జిల్లా అభ్యర్థిని
- వైకల్య నిర్ధారణ లేకుండానే నాడు అభ్యర్థుల ఎంపిక
- గురుకుల నియామకాల్లో ట్రిబ్ నిర్వాకంపై మండిపాటు

నియామక పత్రాన్ని చూపుతున్న బొనగాని భానుప్రియ

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): గురుకులంలో టీజీటీ పోస్టుకు ఎంపికైనట్టు ట్రిబ్ ప్రకటన.. ఫిబ్రవరిలో ఎల్బీస్టేడియం వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్..! కానీ ఇప్పుడు పోస్టింగ్‌కు అనర్హురాలు అంటూ ఆమెను పక్కనబెట్టింది సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీ. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్‌కు చెందిన బొనగాని భానుప్రియ ట్రిబ్ నిర్వహించిన పీజీటీ గణితం రాతపరీక్షకు హాజరయ్యారు. దివ్యాంగ కోటా తుదిజాబితాలో ఎంపికైనట్టు ట్రిబ్ ప్రకటించింది. మల్టీజోన్-1లో సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీ (బాలికలు)కి ట్రిబ్ అలాట్ చేసింది. ఫిబ్రవరి 15న ఎల్బీ స్టేడియం వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి నుంచి అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను సైతం ట్రిబ్ అందజేసింది. అక్కడి వరకు బాగానే ఇప్పుడు పోస్టింగ్ ఇవ్వకుండా ఆ అభ్యర్థిని అధికారులు పక్కనపెట్టారు.

అక్కడ 68 శాతం.. ఇక్కడ 39 శాతం

40 శాతం వైకల్యం ఉన్న అభ్యర్థులే ప్రభుత్వ పథకాలు, ఉద్యోగాలకు అర్హులు అని గత ప్రభుత్వం నిర్ణయించింది. హియరింగ్ ఇంపైర్డ్‌తో ఉన్న భానుప్రియకు సదరంలో కరీంనగర్ జిల్లా వైద్యాధికారులు 68 శాతం మేర వినికిడిలోపం ఉన్నదని ధ్రువీకరించారు. ఉద్యోగానికి ఎంపికైన దివ్యాంగ అభ్యర్థులకు నిర్దేశిత వైకల్య పరీక్షలను సంబంధిత మెడికల్ బోర్డులతో ట్రిబ్ మరోసారి నిర్వహించింది. అందులో భాగంగా భానుప్రియను కోఠిలోని ఈఎన్టీ మెడికల్ బోర్డులో పరీక్షలు నిర్వహించి.. 39 శాతమే వినికిడి లోపం ఉన్నదని తెలిపి, ఉద్యోగానికి అనర్హురాలు అని నిర్ధారించారు. ఆ సర్టిఫికెట్ ఆధారంగా సోషల్ వెల్ఫేర్ సొసైటీ అధికారులు ప్రస్తుతం పోస్టింగ్ ఇవ్వడానికి నిరాకరించారు. అయితే ఒక్కో చోట ఒక్కో తీరు వైకల్యాన్ని నిర్ధారించడం గమనార్హం.

అంతా ట్రిబ్ నిర్వాకం వల్లే..

దివ్యాంగ కోటా పోస్టుల భర్తీలో ఆయా పోస్టులకు 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ప్రకటించి, అభ్యర్థులకు మెడికల్ బోర్డులతో వైద్య పరీక్షలు నిర్వహించాలి. అందులో అర్హులైన వారితో ఆయా పోస్టులకు తుది జాబితాను ప్రకటించాలి. అదే ప్రకారంగా డీఎల్, జేఎల్, టీజీటీ పోస్టులకు అభ్యర్థులను ట్రిబ్ ఎంపిక చేసింది. కానీ పీజీటీ పోస్టులకు మాత్రం ఆ నిబంధనలను గాలికి వదిలేసింది. పీజీటీ పోస్టులకు 1:2 జాబితాను ప్రకటించింది. ఆ అభ్యర్థులకు ట్రిబ్ అధికారులే సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. మెడికల్ టెస్ట్ నిర్వహించకుండానే తుది జాబితాను ట్రిబ్ హడావుడిగా ప్రకటించారు. సొసైటీలకు అలాట్ చేశారు. అనంతరం పీజీటీ అభ్యర్థులకు మెడికల్ టెస్ట్‌లను నిర్వహించగా, ఆయా మెడికల్ బోర్డులు చాలామందికి వైకల్యం లేదని నిర్ధారించినట్టు తెలుస్తున్నది. దీంతో అపాయింట్‌మెంట్ అందుకున్న పీజీటీ దివ్యాంగ అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వటం లేదు. ఆ పోస్టులన్నీ మళ్లీ ఖాళీలుగా మిగిలిపోతున్నాయి. ట్రిబ్ నిర్వాకం వల్లే ఇదంతా అని దివ్యాంగ అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గాంధీ దవాఖానలో మోతీలాల్‌కు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

ఉద్యోగాల కోసం చావోరేవో!

- మూడో రోజుకు మోతీలాల్ దీక్ష
- అండగా విద్యార్థి జేఏసీ,అఖిల పక్షాలు

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ) : నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్ నాయక్‌ను పోలీసులు అరెస్టు చేసినా ఆయన మూడురోజులుగా గాంధీ వైద్యశాలలో నిరాహారదీక్ష కొనసాగిస్తున్నారు. మోతీలాల్ ఆరోగ్యం క్షీణిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని నిరుద్యోగులు రగిలిపోతున్నారు. ఉద్యోగాల కోసం చావోరేవో అనుకొనే అమరణ నిరాహార దీక్షకు దిగామని, లాఠీలతో కొట్టినా, ఠాణాల్లో పెట్టినా భయపడే ప్రసక్తే లేదని చెబుతున్నారు.నిరుద్యోగులు కొనసాగిస్తున్న పోరాటానికి అన్ని వర్గాల నుంచి మద్దతు పెరుగుతున్నది.రాజకీయ పార్టీల అనుబంధ సంఘాలు, బీఆర్ఎస్‌వీ, ఎస్ఎఫ్ఐ, ఐఏఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ వంటి సంఘాలు నిరుద్యోగులకు అండగా నిలిచాయి.

హెచ్‌సీయూలో విద్యార్థుల నిరసన

కొండాపూర్, జూన్ 26: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అధికారుల తీరుపై విద్యార్థులు భగ్గుమన్నారు. యూనివర్సిటీ విద్యార్థులపై విధించిన సస్పెన్షన్, ఫైన్లు, ఎఫ్ ఐఆర్‌లను రద్దు చేయాలని వర్సిటీ ప్రధాన గేటు ముందు విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. యూనివర్సిటీలో నిర్వహించే సుకూన్ ఈవెంట్‌ను రద్దు చేశారని విద్యార్థి నేతలు తెలిపారు. దీంతో వీసీ ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశామని, దాంతో అడ్మినిస్ట్రేషన్ విభాగం అధికారులు ఐదుగురు విద్యార్థులను ఆరు నెలలపాటు సస్పెండ్ చేసినట్టు హెచ్‌సీయూ యూనియన్ ప్రెసిడెంట్ అతిక్ అహ్మద్ తెలిపారు. మరో ఐదుగురు విద్యార్థులకు రూ.10 వేల చొప్పు న ఫైన్‌తోపాటు ఎఫ్ ఐఆర్‌లను నమోదు చేయించినట్టు తెలిపారు. వెంటనే వర్సిటీ యాజమాన్యం తమపై విధించిన సస్పెన్షన్, ఫైన్లు, ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గురుకుల అభ్యర్థుల అరిగోస

- లేని సమస్యను సృష్టించిన కాంగ్రెస్
- వేలాదిగా మిగిలిపోతున్న పోస్టులు
- కాంగ్రెస్ ఖాతాలో వేసుకునే కుట్ర
- క్రెడిట్ కోసం సీఎం పాకులాట
- ఆందోళ న బాటలో అభ్యర్థులు

పైచిత్రంలో ఇద్దరు బిడ్డలతో కలిసి ప్లకార్డులు తయారుచేస్తున్నది సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన బూడిద యోగి. ఇటీవల ట్రిబ్ ప్రకటించిన 1:2 జాబితాలో ఉన్నాడు. ప్రభుత్వం రిలింక్విష్‌మెంట్ విధానాన్ని అమలుచేస్తే ఉద్యోగం కచ్చితంగా వచ్చే అవకాశం ఉన్నది. ఆ ఆశతోనే దాదాపు 4 నెలలుగా ఎదురు చూస్తున్నాడు. సహచర అభ్యర్థులతో కలిసి ప్రభుత్వ పెద్దలు, కార్యాలయాల చుట్టూ భార్యతో సహా ప్రదక్షిణలు చేస్తున్నాడు. తండ్రి వేదనను చూడలేక పిల్లలు దీక్షిత, ప్రసన్న బాసటగా నిలుస్తున్నా కాంగ్రెస్ సర్కారు నుంచి మాత్రం స్పందన కరువైంది. గురుకుల అభ్యర్థులు పడుతున్న అరిగోసకు ఈ చిత్రమే నిదర్శనంగా నిలిచింది.

హైదరాబాద్, జూన్26 (నమస్తే తెలంగాణ): ఏండ్ల తరబడి గురుకుల ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూసిన అభ్యర్థులకు అంతిమంగా నిరాశే మిగిలింది. సీఎం రేవంత్ రెడ్డి తన రాజకీయ ఇమేజ్ కోసం అభ్యర్థుల జీవితాలను పణంగా పెట్టారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన పోస్టుల్లో భారీగా మిగిలిపోతుంటే, మరోవైపు వేలాది మంది అభ్యర్థుల ఆశలకు గండిపడుతున్నది. ఈ నేపథ్యంలో రీలింక్విష్‌మెంట్‌ను అమలు చేసి ఒక్కపోస్టు కూడా మిగలకుండా భర్తీచేస్తే వేలాది మందికి లబ్ధి చేకూరుతుందని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై ప్రభుత్వ పెద్దలు, అధికారుల చుట్టూ తిరుగుతూ నాలుగు నెలలుగా అరిగోస పడుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో 9 క్యాటగిరీల్లో 9,210 పోస్టుల భర్తీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ట్రిబ్ నోటిఫికేషన్‌ను జారీచేసింది. ఆగస్టులో రాత పరీక్షలను నిర్వహించింది. ఆ తర్వాత ఎన్నికల కోడ్ కారణంగా పరీక్ష ఫలితాల విడుదల వాయిదా పడింది. ఈలోగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాల లబ్ధి కోసం అభ్యర్థులను ఆగం చేసింది. అర్హులే లేరంటూ అధికారికంగానే ట్రిబ్ 404 పోస్టులను నింపనేలేదు. డీసెండింగ్ ఆర్డర్‌కు తిలోదకాలిచ్చింది. రాత్రికి రాత్రే సర్టిఫికేషన్ వెరిఫికేషన్ నిర్వహించి, తుది జాబితాలను ప్రకటించి, అపాయింట్‌మెంట్ ఆర్డర్లను ఇచ్చింది. దీంతో ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్న దాదాపు 2,500 పోస్టులు బ్యాక్‌లాగ్ పడుతున్నాయి.

ఆ నలుగురిపై అభ్యర్థుల ఆగ్రహజ్వాల

నలుగురు కాంగ్రెస నేతల తీరుపై గురుకుల అభ్యర్థులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఎన్నికలకు ముందు తమతో ధర్నాలు చేయించిన ఆ నేతలే నేడు తమను చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ యువనాయకుడితోపాటు ఎమ్మెల్సీ పదవి దక్కించుకున్న మరో కీలక నేత ఇప్పుడు తమ సమస్యను పట్టించుకోవడమే లేదని వాపోతున్నారు. నేడు, రేపు అంటూ దాటవేస్తున్నారని, ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలను ఇప్పించలేకపోతున్నారని మండిపడుతున్నారు. ఇదేమని అడిగితే ఉన్నత పదవిని దక్కించుకున్న మరో కాంగ్రెస్ నేత తమనే దుర్భాషలాడుతున్నారని, పదవులు దక్కించుకొని నేడు పెదవులు మూసుకున్నారని అభ్యర్థులు ఎద్దేవా చేస్తున్నారు. ఇదే అంశంపై సర్కారు పెద్దలతో చర్చిస్తానని సదరు యువనేత ఇచ్చిన హామీ సైతం ఉత్తముచ్చటే అయ్యిందని, ఇప్పుడు పో స్టింగ్స్ ఇచ్చిన తర్వాత అయినా ఇప్పిస్తానని మ భ్యపెడుతున్నారని ఆందోళన చెందుతున్నారు.

తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం

ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని గురుకుల అభ్యర్థులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే ఆయా సొసైటీలు పోస్టింగులు ఇచ్చే ప్రక్రియను ప్రారంభించాయని, రీలింక్విష్‌మెంట్ అమలు చేయకుండా పోస్టింగ్స్ ఇచ్చాక చేసేదేమీ లేదని అభ్యర్థులు వాపోతున్నారు. రీలింక్విష్‌మెంట్ అమలు కోసం ఆమరణ దీక్షకు చేపడుతున్నామని తెలిపారు. ఈ మేరకు కార్యాచరణ రూపొందించుకొంటున్నామని చెప్పారు. అందులో భాగంగా బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ఎదుట మోకాళ్లపై కూర్చొని ధర్నాకు దిగారు. సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగాలను భర్తీ చేయాలని వారంతా డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్ ఉద్యోగాలేవి?

మొదటిపేజీ తరువాయి...

మంత్రివర్గంలో ఉన్నవాళ్లంతా సమైక్యవాదులేనని, వాళ్లిక తెలంగాణ రాష్ట్రానికి ఏం చేస్తారని ప్రశ్నించారు. నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగుల పక్షాన నిలబడుతామని ప్రకటించి కాంగ్రెస్‌కు డబ్బా కొట్టినవాళ్లంతా ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. సమావేశానికి హాజరైన వక్తలంతా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మాటలు నీటిమూటలయ్యాయని, సీఎం రేవంత్‌కు పట్టింపులేదని, అందుకే రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుద్యోగుల తరపున జంగ్‌సైరన్ పూరిస్తున్నామని, ప్రతి ఒక్క నిరుద్యోగి సామాజిక మాధ్యమాల వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు, రాహుల్, ప్రియాంక, రేవంత్ అబద్ధాలను జోడిస్తూ 'ధూ..ధూ..'ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగుల సెగ కాంగ్రెస్‌కు, ఆ పార్టీ అధిష్ఠానానికి గట్టిగా తాకాలన్నారు.

మోసంచేసి కాంగ్రెస్ గెలిచింది

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు పెంచుతామని నిరుద్యోగులను మభ్యపెట్టారని, ధర్నాచౌక్‌లు, హాస్టళ్లు, ఇనిస్టిట్యూట్లకు వచ్చి ప్రగల్భాలు పలికారని, చివరికి ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను పిలిపించి మరీ అబద్ధాలు చెప్పించారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో గెలవలేదని, నిరుద్యోగులను నమ్మించి వాడుకొని అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. మొదటి క్యాబినెట్ సమావేశాల్లోనే డీఎస్సీ, నిరుద్యోగుల సమస్యల పరిష్కారంపై తీర్మానం చేస్తారని భావించామని, కాని మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క అంశంపైనా చర్చ జరగలేదని, నాడే ఇది మొదటి మోసమని గుర్తించామని చెప్పారు. నిరుద్యోగులు కాళ్లావేళ్లా పడాల్సిన పనిలేదని, కాళ్లు పట్టి లాగాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భట్టి విక్రమార్క గ్రూప్-1 ప్రిలిమినరీ పోస్టులు 1:100 నిష్పత్తితో ఇవ్వాలని డిమాండ్ చేశారని, కానీ గద్దెనెక్కిన తర్వ